# హజ్ మరియు ఉమ్రహ్ - 2

[ తెలుగు – Telugu – تلغو ]


షేఖ్ అబ్దుల్ అజీజ్ బిన్ బాజ్ (రహిమహుల్లాహ్)

అనువాదం : ముహమ్మద్ కరీముల్లాహ్

రివ్యూ : షేఖ్ నజీర్ అహ్మద్



2012 - 1433

IslamHouse.com

# ﴿ الحج والعمرة – 2 ﴾

« باللغة تلغو »

سماحة الشيخ عبد العزيز بن باز - رحمه الله

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نذير أحمد

2012 - 1433

IslamHouse.com

# మీఖాత్ చేరగానే హజ్ యాత్రికుడు ఏమి చేయాలి?

మీఖాత్[1] చేరగానే హజ్ యాత్రికుడు గుసుల్ చేసి (ఇస్లామీయ పద్ధతిలో స్నానం చేసి), అత్తరు పూసుకోవలెను. ఇహ్రాం దుస్తులు ధరించే ముందు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మామూలుగా తొడిగే దుస్తులు విడిచి, గుసుల్ చేసి, అత్తరు పూసుకునే వారని ఉల్లేఖించబడింది. 'ఇహ్రాం దుస్తులు ధరించే ముందు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం శరీరం పై అత్తరు పూసేదానిని' అని పలికిన ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖన సహీహ్ అల్ బుఖారీ మరియు సహీహ్ అల్ ముస్లిం హదీథు గ్రంథాలలో నమోదు చేయబడి ఉన్నది. కాబాగృహం యొక్క తవాఫ్ ప్రారంభించక ముందు ఆయన తన కుడిభుజంపై నుండి ఇహ్రాం దుస్తుల్ని తొలగించినపుడు కూడా ఆమె అలాగే చేసేది.

## బహిష్టు, ఇతర రక్తస్రావపు స్థితిలోని మహిళల కొరకు హజ్ నియమాలు:

ఆయెషా రదియల్లాహు అన్హా ఉమ్రహ్ కొరకు ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించిన తరువాత, ఆమెకు బహిష్టు రక్తస్రావం మొదలైంది. గుసుల్

[1]. హజ్ యాత్రికుడు నిర్దేశించబడిన దుస్తులు ధరించి, హజ్ లేదా ఉమ్రహ్ సంకల్పం చేసుకుని ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించే స్థలం.

చేసి, హజ్ కొరకు ఇహ్రాం దుస్తులు ధరించమని ఆమెకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆజ్ఞాపించారు.

హజ్ యాత్రకు బయలుదేరిన అస్మా బిన్తె ఉమైస్ రదియల్లాహు అన్హా దుల్ హులైఫహ్ అనే మీఖాత్ ప్రాంతంలో ప్రసవించినపుడు, ఆమెను గుసుల్ చేసి, బహిష్టు సమయంలో మహిళలు వాడే దూది మెత్త (ప్యాడ్) పెట్టుకుని, ఇహ్రాం దుస్తులు ధరించమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించారు.

పై ఉల్లేఖనల నుండి గ్రహించేదేమిటంటే, బహిష్టు మరియు పురుడు పోసుకున్న మహిళలు హజ్ కొరకు మీఖాత్ ప్రాంతం చేరిన తరువాత గుసుల్ చేసి, ఇహ్రాం దుస్తులు ధరించవలెను. ఆమె కాబాగృహ తవాఫ్ తప్ప, హజ్ ఆచరణలన్నింటినీ పూర్తి చేయాలి. ఆయెషా రదియల్లాహు అన్హా మరియు అస్మా బిన్తె ఉమైస్ రదియల్లాహు అన్హాలకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇచ్చిన పై ఆదేశాల నుండి ఈ నియమం గ్రహించబడింది.

ఇహ్రాం దుస్తులు ధరించటానికి ముందు, తమ మీసాలను కత్తిరించుకొనుట, గోళ్ళను కత్తిరించుట, చంకలలోని మరియు బొడ్డు క్రింది వెంట్రుకలు తొలగించుట ఉత్తమం. ఇహ్రాం స్థితిలో ఈ పనులు చేయకూడదనే విషయాన్ని అతను  తెలుసుకోవాలి. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిన ఆవశ్యకమైన సున్నతు ఇది. కాబట్టి వీటి

గురించి అన్ని సమయాలలోనూ అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవలెను.

సహీహ్ అల్ బుఖారీ మరియు సహీహ్ అల్ ముస్లింలోని అబూ హురైరహ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన హదీథులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

"మానవుడి సహజసిద్ధమైన పరిశుభ్రత ఆచారములు ఐదు: సుంతి, బొడ్డు క్రింది వెంట్రుకలు తొలగించుట, మీసాలు కత్తిరించుట, గోళ్ళు కత్తిరించుట, మరియు చంకలలోని వెంట్రుకలు తొలగించుట."

సహీహ్ అల్ ముస్లింలో అనస్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన హదీథులో, మీసాలు మరియు గోళ్ళు కత్తిరించుట కొరకు, చంకలలోని మరియు బొడ్డు క్రింది వెంట్రుకలు తొలగించుట కొరకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక నిర్ణీత కాలాన్ని నిశ్చయించారని తెలుపబడింది. వాటిని 40 దినాల కంటే అధికంగా వదిలివేయకూడదని ఆయన మనల్ని ఆదేశించారు. అన్నసాయి హదీథు గ్రంథంలో పేర్కొనబడిన దాని ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వీటి కొరకు ఒక నిర్ణీత సమయాన్ని నిశ్చయించారు. అలాంటి ఉల్లేఖన అహ్మద్, అబూ దావూద్, అత్తిర్మిథీ హదీథు గ్రంథాలలో కూడా పేర్కొనబడింది.

అయితే, ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించక ముందు తలవెంట్రుకలు తగ్గించుకోవటమనేది షరియతులో ఎక్కడా నిర్దేశించబడలేదు.

## గెడ్డం గీయడం అనుమతించబడలేదు:

అన్ని వేళల్లో గెడ్డం గీయడం లేదా చిన్నది చేయటం నిషేధించబడింది. దీనికి విరుద్ధంగా, సహీహ్ అల్ బుఖారీ మరియు సహీహ్ అల్ ముస్లిం గ్రంథాలలో నమోదు చేయబడిన అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా యొక్క ఈ ఉల్లేఖన ఆధారంగా, తమ గెడ్డాన్ని పెరగనీయడం పురుషులపై తప్పనిసరి విధి:

దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "బహుదైవారాధకులకు భిన్నంగా ఉండండి – మీ గెడ్డాన్ని పెరగటానికి వదిలివేయండి మరియు మీ మీసాలను కత్తిరించండి."

ముస్లిం హదీథు గ్రంథంలో నమోదు చేయబడిన అబూ హురైరహ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన హదీథులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "మీసాలు కత్తిరించండి మరియు గెడ్డాన్ని పెరగనివ్వండి. అగ్ని ఆరాధకులకు భిన్నంగా ఉండండి."

ఈనాడు విచారించవలసిన విషయం ఏమిటంటే గెడ్డానికి సంబంధించిన సున్నతును వ్యతిరేకించటం మరియు తమను తాము సత్యతిరస్కారులను, స్త్రీలను పోలి ఉండటానికి తమ శాయశక్తులా కృషి

చేయటమనేది చాలా మంది కొరకు సామాన్యమైన గర్హణీయ అలవాటుగా మారిపోయింది. సున్నతులను అనుసరించేలా, వాటిని దృఢంగా పట్టుకునేలా మరియు అధిక శాతం ప్రజలు ఇష్టం లేకపోయినా సరే, వాటిని ఇతరుల వరకు చేర్చేలా మాకూ మరియు ముస్లింలందరికీ అల్లాహ్ దారి చూపుగాక! మా కొరకు అల్లాహ్ యే చాలును మరియు ఆయన అత్యుత్తమమైన సంరక్షుడు. సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ కాకుండా మరే ఇతర శక్తీ లేదు, మరే ఇతర అధికారమూ లేదు.

ఆ తరువాత యాత్రికుడు, కుట్టబడని రెండు వస్త్రాలను – ఒకటి నడుము చుట్టూ (ఇజార్), రెండోది శరీరం పైభాగం పై (రిదా) ధరించవలెను. ఆ రెండు వస్త్రాలు తెలుపు రంగులో ఉండి, పరిశుద్ధంగా ఉండటం మంచిది. ఇంకా ఇహ్రాం దుస్తులు ధరించటంతో పాటు. అతను రబ్బరు చెప్పులు, పాదుకలు/పావుకోళ్లు ధరించటం మంచిది. దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

“ప్రతి ఒక్కరూ ఇజార్ (నడుము చుట్టూ చుట్టుకునే లుంగీ వంటి వస్త్రం) మరియు రిదా (శరీర పై భాగాన్ని కప్పటానికి వాడే వస్త్రం) అనే రెండు వస్త్రాలను ఇహ్రాంగా ధరించవలెను మరియు చెప్పులను (ధరించవలెను).” అహ్మద్ హదీథ్ గ్రంథం

## మహిళలు ఏ దుస్తులలోనైనా ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవచ్చును:

ఇహ్రాం స్థితిలో నలుపు, ఆకుపచ్చ, గోధుమ రంగు వంటి ఏ రంగు దుస్తులనైనా సరే ధరించటానికి మహిళలకు అనుమతి ఉంది. అయితే తమ దుస్తులు పురుషుల దుస్తులతో పోలి ఉండకుండా జాగ్రత్త పడవలెను. మహిళల ఇహ్రాం నలుపు లేదా ఆకుపచ్చ రంగులోనే ఉండవలెనని పట్టుపట్టే మహిళల వాదనలకు షరిఅత్ లో ఎలాంటి ఆధారమూ లేదు.

గుసుల్ (ఇస్లామీయ పద్ధతిలో స్నానం) చేసి, పరిశుభ్రమై, ఇహ్రాం దుస్తులు ధరించిన తరువాత తాము చేయాలనుకుంటున్న హజ్ లేదా ఉమ్రహ్ కొరకు హృదయంలో నియ్యత్ (సంకల్పం) చేసుకోవలెను. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: "ఆచరణలు సంకల్పంపై ఆధారపడి ఉంటాయి మరియు ఎవరైనా ఏదైతే సంకల్పించుకుంటాడో, అతడు దానినే పొందుతాడు."

షరిఅత్ ప్రకారం హజ్ లేదా ఉమ్రహ్ నియ్యత్ (సంకల్పాన్ని) పలుకులను బహిరంగంగా ఉచ్ఛరించవలెను. ఎవరైనా ఉమ్రహ్ చేయాలని సంకల్పిస్తే "లబ్బైక్ ఉమ్రహ్ లేదా అల్లాహుమ్మ, లబ్బైక్ ఉమ్రహ్ (ఉమ్రహ్ కొరకు హాజరయ్యాను లేదా ఓ అల్లాహ్, ఉమ్రహ్ కొరకు హాజరయ్యాను)" అని ఉచ్ఛరించవలెను. అలాగే ఎవరైనా హజ్

కొరకు నియ్యత్ చేయాలనుకుంటే, "లబ్బైక్ హజ్ లేదా అల్లాహుమ్మ లబ్బైక్ హజ్ (హజ్ కొరకు హాజరయ్యాను లేదా ఓ అల్లాహ్, హజ్ కొరకు హాజరయ్యాను)" అని ఉచ్ఛరించవలెను. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుసరించిన విధానం ఇదే. తమ వాహనంపై ఎక్కిన తరువాత ఈ నియ్యత్ ఉచ్ఛరించటం మంచిది. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన సవారీపై ఎక్కిన తరువాత 'లబ్బైక్' అని పలికినారు. అది అప్పటికే మీఖాత్ ప్రాంతం దాటి మక్కా వైపు సాగిపోయింది. పండితులు సమ్మతించిన ఉత్తమ పద్ధతి ఇదే.

## ఇహ్రాం నియ్యత్ కాకుండా వేరే నియ్యత్ ఉచ్ఛరించటమనేది ధర్మంలో లేని ఒక నూతన కల్పితాచారం:

కేవలం ఇహ్రాం కొరకు మాత్రమే బహిరంగంగా నియ్యత్ ఉచ్ఛరించటాన్ని షరిఅత్ ఆమోదించినది. ఎందుకంటే ఇది ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ప్రామాణిక హదీథు పై ఆధారపడి ఉన్నది. అయితే, నమాజు కొరకు, తవాఫ్ కొరకు లేదా ఇతర ఆరాధనలు ఆచరించుట కొరకు బహిరంగంగా నియ్యత్ చేయుట అనుమతించబడినదనే ఆదేశం షరిఅత్ లో లేదు. ఉదాహరణకు, 'ఈ నమాజు చేయుట కొరకు నేను నియ్యత్ చేస్తున్నాను' లేదా 'నేను తవాఫ్ చేయుట కొరకు నియ్యత్ చేస్తున్నాను' అని ఉచ్ఛరించకూడదు. ఆ విధంగా ఉచ్ఛరించటమనేది ధర్మంలో లేని ఒక కల్పితాచారం. మరో మాటలో చెప్పాలంటే హజ్ లేదా

ఉమ్రహ్ కొరకు తప్ప మరే ఇతర ఆరాధన కొరకైనా బహిరంగంగా నియ్యతు ఉచ్ఛరించటమనేది ఒక పాపిష్టి పని. ఒకవేళ అలా బహిరంగంగా ఉచ్ఛరించటమనేది షరిఅత్ లో అనుమతించబడిన విషయమైనతే, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాని గురించి ఆదేశించేవారు. లేదా తన పలుకుల ద్వారా లేదా ఆచరణల ద్వారా ప్రదర్శించి చూపేవారు. అలాగే సజ్జనులైన ముందుతరం ముస్లింలు దానిని ఆచరించేవారు. ఏదేమైనా ఇలాంటి బహిరంగ ఉచ్ఛరణలకు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సున్నతలో లేదా సజ్జనులైన సహాబాల సున్నతులలో ఎలాంటి ఆధారమూ లేదు. ఇదొక గర్హనీయమైన కల్పితాచారం మాత్రమే.

ఇలాంటి కల్పితాచరణలను గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా హెచ్చరించారు:

"ఆచరణలన్నింటిలో అత్యంత చెడ్డవి - కల్పితాచరణలు. మరియు ప్రతి నూతన కల్పితాచరణ ఒక పెడదారి (మాత్రమే)." ముస్లిం హదీథు గ్రంథం

## మీఖాతుల గురించి:

ఇహ్రాం స్థితిలో ప్రవేశించే మక్కా పవిత్ర సరిహద్దులు. మొత్తం ఐదు మీఖాతులు ఉన్నాయి.

1. మదీనా వైపు నుండి వచ్చే ప్రజల కొరకు మీఖాతు – దుల్ హులైఫహ్. దీని మరో పేరు అబ్యార్ అలీ.

2. సిరియా వైపు నుండి వచ్చే ప్రజల కొరకు మీఖాతు – జుహ్ఫాహ్. ఇది రాబిగ్ అనే నిర్మానుష్య పల్లె వద్ద ఉంది. ప్రస్తుతం ప్రజలు రాబిగ్ నుండి ఇహ్రాం దుస్తులు ధరిస్తున్నారు. ఏదేమైనా రాబిగ్ నుండి ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించిన ప్రజలు సరైన మీఖాతు ప్రాంతం నుండే ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించినట్లే. ఎందుకంటే ఈ దారిలో మక్కా వెళ్ళే ప్రజల కొరకు రాబిగ్ ప్రాంతం, జుహ్ఫాహ్ కంటే కొంచెం ముందుగా వస్తుంది.

3. నజ్ద్ వైపు నుండి వచ్చే ప్రజల కొరకు మీఖాతు – ఖర్న్ అల్ మంజిల్. దీని మరో పేరు అస్సైల్.

4. యమన్ వైపు నుండి వచ్చే ప్రజల కొరకు మీఖాతు – యలంలం.

5. ఇరాక్ వైపు నుండి వచ్చే ప్రజల కొరకు మీఖాతు – ధాత్ ఇర్ఖ్.

ఈ మీఖాతులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చే నిర్ణయించబడినవి. హజ్ లేదా ఉమ్రహ్ కొరకు అటువైపు నుండి వచ్చే ప్రజల కొరకు ఆ యా మీఖాతు ప్రాంతాలు తప్పని సరి అయి ఉన్నాయి.

ఇహ్రాం స్థితిలో ప్రవేశించకుండా మీఖాతు ప్రాంతాన్ని దాటడం హజ్ / ఉమ్రహ్ యాత్రికుని కొరకు నిషేధించబడింది:

ఆ యా ప్రాంతాల ప్రజల కొరకు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పై నిర్ణీత మీఖాతులను నిర్ణయించినారు. హజ్ లేదా ఉమ్రహ్ నియ్యత్ తో ఈ మీఖాతు ప్రాంతాలను దాటే ప్రతి ఒక్కరి కొరకు అవి నిర్దేశించబడినాయి. హజ్ లేదా ఉమ్రహ్ చేసే నియ్యత్ తో మక్కా వైపు ప్రయాణించే ప్రతి ఒక్కరి కొరకు, ఈ మీఖాతు ప్రాంతంలో ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించడం తప్పనిసరి. రోడ్డు పై ప్రయాణిస్తున్నా లేదా విమానం పై ప్రయాణిస్తున్నా సరే, ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించకుండా ఇక్కడి నుండి ముందుకు పోరాదు. ఎందుకంటే ఈ మీఖాతు ప్రాంతాలను నిర్ణయించినపుడు,

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక మూల నియమాన్ని ఉపదేశించినారు.

“ఈ మీఖాతు ప్రాంతాలు ఆ యా ప్రాంతవాసులపై తప్పనిసరి అయి ఉన్నాయి. మరియు ఎవరైతే హజ్ లేదా ఉమ్రహ్ చేసే నియ్యత్ తో ఈ

(మీఖాతు) ప్రాంతాలను దాటుకుంటూ ముందుకు సాగుతారో, అలాంటి వాళ్ళపైన కూడా."

ఎవరైనా హజ్ లేదా ఉమ్రహ్ చేసే సంకల్పంతో విమానంలో మక్కా వైపు ప్రయాణించ దలిస్తే, విమానంలోనికి ఎక్కే ముందే వారు గుసుల్ (ఇస్లామీయ పద్ధతిలో పూర్తి స్నానం) చేయవలెను. విమానం మీఖాత్ ప్రాంతాన్ని సమీపిస్తున్నపుడు, ఇహ్రాం దుస్తులు ధరించి, సమయం ఉంటే తమ సంకల్పాన్ని అనుసరించి, "లబ్బైక్ ఉమ్రహ్" అని ఉచ్ఛరించవలెను. ఒకవేళ అంత సమయం లేకపోతే, హజ్ యాత్రికులు కేవలం "లబ్బైక్" అని ఉచ్ఛరించవలెను. ఒకవేళ ఎవరైనా విమానం ఎక్కక ముందు లేదా మీఖాత్ సమీపించక ముందు ఇహ్రాం దుస్తులు ధరిస్తే, అందులో ఎలాంటి దోషమూ లేదు. అయితే అతను మీఖాతు ప్రాంతం చేరకుండా లేదా మీఖాతు ప్రాంతం సమీపించకుండా ఉమ్రహ్ లేదా హజ్ నియ్యత్ చేసుకోరాదు మరియు లబ్బైక్ అని ఉచ్ఛరించరాదు. కాబట్టి, ధర్మానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించుట ప్రతి ముస్లింపై తప్పని సరి విధి అయి ఉంది.

దీని గురించి అల్లాహ్ ఆదేశం ఇలా ఉన్నది:

"నిశ్చయంగా అల్లాహ్ యొక్క ప్రవక్తలో మీ కొరకు మంచి ఉపమానం ఉన్నది" ఖుర్ఆన్ 33:21

తన అంతిమ వీడ్కోలు హజ్ ప్రసంగంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు:

"మీ హజ్ ఆచరణలు నా నుండి నేర్చుకోండి"

అయితే, హజ్ లేదా ఉమ్రహ్ చేసే సంకల్పం లేని వ్యక్తులు అంటే ఉద్యోగరీత్యా వివిధ పనుల కొరకు లేదా వ్యాపారం కొరకు మక్కా వెళ్ళే ప్రజలు ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవలసిన ఆవశ్యకత లేదు. ఒకవేళ అతను హజ్ లేదా ఉమ్రహ్ చేయాలని సంకల్పించి, మీఖాతు వద్ద ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశిస్తే, అందులో ఎలాంటి దోషమూ లేదు. ఎందుకంటే మీఖాతు విషయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఆదేశించారు:

"ఈ మీఖాతు ప్రాంతాలు ఆ యా ప్రాంతవాసులపై తప్పనిసరి అయి ఉన్నాయి. మరియు ఎవరైతే హజ్ లేదా ఉమ్రహ్ చేసే నియ్యత్ తో ఈ (మీఖాతు) ప్రాంతాలను దాటుకుంటూ ముందుకు సాగుతారో, అలాంటి వాళ్ళపైన కూడా."

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క పై ఆదేశానికి అర్థం ఏమిటంటే, ఎవరైతే ఈ మీఖాతు ప్రాంతాలను హజ్ లేదా ఉమ్రహ్ చేసే సంకల్పంతో కాకుండా దాటుతారో, అలాంటి వారు ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవలసిన ఆవశ్యకత లేదు. నిశ్చయంగా అల్లాహ్ యొక్క

దాసుల కొరకు ఇదొక గొప్ప అనుగ్రహం మరియు సౌలభ్యం. అల్హందులిల్లాహ్ – సకల స్తోత్రములు, కృతజ్ఞతలు అల్లాహ్ కొరకే.

పై విషయం మరో వాస్తవ సంఘటన ద్వారా కూడా సమర్ధించబడింది – మక్కా దండయాత్ర సమయంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలో ప్రవేశించినపుడు ఇహ్రాం స్థితిలో లేరు. అంతేకాక అపుడు ఆయన తలపై శిరస్త్రాణం ధరించి ఉన్నారు. ఎందుకంటే ఆయన అపుడు హజ్ లేదా ఉమ్రహ్ చేసే సంకల్పంతో మక్కాలో ప్రవేశించలేదు. మక్కా నగరాన్ని జయించే మరియు అక్కడి విగ్రహారాధనను సమూలంగా తుడిచిపెట్టే ఉద్దేశంతో ఆయన మక్కాలో ప్రవేశించారు.

ఎవరైతే మీఖాతు సరిహద్దుల లోపల (ఉదాహరణకు జిద్దా పట్టణంలో, ఉమ్ సలమహ్, బహ్రా, షరాఇ, బదర్, మస్తూరహ్ మొదలైన ప్రాంతాలలో) నివసిస్తున్నారో, అలాంటి వారు ఏదో ఒక మీఖాతు వద్దకు వెళ్ళి ఇహ్రాం దుస్తులు ధరించి, హజ్ లేదా ఉమ్రహ్ నియ్యత్ చేసుకోవలసిన అవసరం లేదు, వారి కొరకు వారు ఉంటున్న నివాసమే మీఖాత్. హజ్ లేదా ఉమ్రహ్ చేయాలని అనుకున్నపుడు, వారు ఇహ్రాం దుస్తులు ధరించి, నియ్యత్ చేసుకుని, తమ ఇంటి నుండే ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించాలి.

అయితే, ఎవరికైనా మీఖాతు సరిహద్దు వెలుపల మరో ఇల్లు ఉన్నట్లయితే, వారు మీఖాతు ప్రాంతానికి చేరుకుని ఇహ్రాం స్థితిలోనికి

ప్రవేశించ వచ్చును లేదా మక్కా వైపు మీఖాతు ప్రాంతానికి దగ్గరున్న తమ ఇంటిలో ఇహ్రాం ధరించవచ్చు. దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిన విషయాన్ని అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఇలా ఉల్లేఖించారు:

"ఎవరైతే మీఖాత్ లోపల నివసిస్తున్నారో, అలాంటి వారి కొరకు వారి ఇల్లే వారి ఇహ్రాం (లో ప్రవేశించే) స్థానం. మక్కావాసులు మక్కాలోపలే ఇహ్రాం ధరించవచ్చు." (బుఖారీ మరియు ముస్లిం)

అయితే ఎవరైతే కాబా పవిత్ర సరిహద్దుల లోపల (హరమ్ లోపల) ఉండి, ఉమ్రహ్ చేయాలని సంకల్పించుకున్నారో, వారు ఆ సరిహద్దుల బయటకు వెళ్ళి, ఉమ్రహ్ కొరకు ఇహ్రాం ధరించి మరలి రావలెను. ఉమ్రహ్ చేయదలచిన తన కోరికను ఆయెషా రదియల్లాహు అన్హా తెలిపినపుడు, ఆమెను కాబా పవిత్ర సరిహద్దుల బయటకు తీసుకు వెళ్ళి, ఇహ్రాంలో ప్రవేశింప జేయమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆమె సోదరుడు అబ్దుర్రహ్మాన్ ను ఆదేశించారు. దీని నుండి తెలిసినదేమిటంటే, ఎవరైనా ఉమ్రహ్ చేయాలని సంకల్పించినవారు, పవిత్ర కాబా సరిహద్దుల లోపల ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించలేరు. కాబట్టి వారు కాబా పవిత్ర సరిహద్దుల బయటకు వెళ్ళి ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవలెను. ఈ హదీథు ,ఇంతకు ముందు తెలిపిన అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ రదియల్లాహు అన్హుమా హదీథు విషయాన్ని మరింతగా స్పష్టం చేస్తున్నది. అంతేగాక మక్కావాసులు, మక్కాలోపలే ఇహ్రాం

ధరించవచ్చనే ఆదేశం హజ్ కొరకు మాత్రమే ప్రత్యేకమనే విషయాన్ని కూడా స్పష్టం చేస్తున్నది. కాబట్టి అది ఉమ్రహ్ కొరకు వర్తించదు. ఒకవేళ ఉమ్రహ్ కొరకు కాబా సరిహద్దుల లోపలే ఇహ్రాం ధరించే అవకాశం ఉంటే, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన భార్య ఆయేషా రదియల్లాహు అన్హాకు అలా చేయటానికి అనుమతి ఇచ్చి, కాబా పవిత్ర సరిహద్దుల బయటకు వెళ్ళి ఇహ్రాం ధరించమని చెప్పి ఉండేవారు కాదు కదా! ఇది వివాదరహితమైన ఋజువు. కాబట్టి ఇస్లామీయ ఉలేమాలందరూ ఇదే అభిప్రాయంతో ఉన్నారు. అంతేగాక పై రెండు హదీథులతో ఈ అభిప్రాయం ఏకీభవించటం వలన దీనిని అనుసరించడమే ముస్లింల కొరకు సరైనది.

## హజ్ పూర్తి చేసిన తరువాత అనేకసార్లు ఉమ్రహ్ చేయటాన్ని షరిఅతు ప్రోత్సహించటం లేదు:

హజ్ యాత్ర ఆరంభంలో ఉమ్రహ్ చేసి ఉండి, హజ్ పూర్తయిన తరువాత తనీమ్ లేదా జిరానహ్ ప్రాంతానికి వెళ్ళి, ఇహ్రాం ధరించి, మరల మరల ఉమ్రహ్ లు చేసే కొందరు ప్రజల పద్ధతికి షరిఅతులో ఎలాంటి ఆధారమూ లేదు. అలాంటి విధానం నిరాధారమైనది. అంతేగాక అది అంగీకరించబడలేదు కూడా. ఇలా హజ్ తరువాత చేసే ఉమ్రహ్ సముచితమైనది కాదని ప్రామాణిక నివేదనలలో పేర్కొనబడింది.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఆయన సహచరులు హజ్ పూర్తి చేసిన తరువాత మరల ఉమ్రహ్ చేయలేదు. తనీమ్ నుండి ఆయేషా రదియల్లాహు అన్హా చేసిన ఉమ్రహ్ గురించి అయితే, మక్కా చేరిన వెంటనే ఆవిడ బహిష్టు ప్రారంభమవటం వలన ఆవిడ అపుడు ఉమ్రహ్ చేయలేక పోయారు. దానికి బదులుగా అంటే మీఖాత్ లో ఇహ్రాం ధరించి, బహిష్టు ప్రారంభమైన కారణంగా పూర్తిచేయలేక పోయిన ఉమ్రహ్ కు బదులుగా మరో ఉమ్రహ్ చేయటం కొరకు అనుమతించమని ఆవిడ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అడిగారు. మరియు దానికి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతించినారు. దీని కారణంగా ఆవిడ రెండు ఉమ్రహ్ లు చేసినట్లయింది – ఒకటి హజ్ తో పాటు మరియు రెండోది తనీమ్ నుండి. కాబట్టి, ఆయేషా రదియల్లాహు అన్హా స్థితిలాంటి స్థితిని ఎదుర్కొంటే, వారు హజ్ తరువాత ఉమ్రహ్ చేయవచ్చు. అయితే మాటిమాటికీ ఉమ్రహ్ చేస్తూ, రద్దీ పెంచి, తోటి ముస్లింలకు అసౌకర్యాన్ని కలిగించకుండా ప్రజలు ప్రవర్తించవలెను.

నిస్సందేహంగా యాత్రికులు మరల ఉమ్రహ్ చేయటమనేది అక్కడి ప్రజలను అసౌకర్యానికి గురిచేస్తుంది. ఫలితంగా, రద్దీ పెరిగి పోతుంది మరియు ట్రాఫిక్ యాక్సిడెంట్లు పెరిగి పోతాయి. అంతేగాక, ఈ విధానం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్ల్ సున్నతుకు విరుద్ధమైనది కూడా.

హజ్ కాలంలో గాకుండా వేరే సమయంలో మీఖాతు ప్రాంతానికి చేరుకోవటం:

మీఖాతు ప్రాంతానికి చేరుకునేవారు – క్రింద పేర్కొన్న రెండింటిలో ఒక వర్గానికి చెందిన వారనేది తెలుకోవలెను.

1. మొదటి వర్గం ప్రజలు: హజ్ కాలంలో గాకుండా, వేరే సమయంలో అంటే రమదాన్, షఆబాన్ మొదలైన నెలలలో ఉమ్రహ్ కొరకు అక్కడికి చేరుకునేవారు. అలాంటి వారు ఉమ్రహ్ చేసే సంకల్పంతో 'లబ్బైక్ ఉమ్రహ్' అని లేదా 'అల్లాహుమ్మ లబ్బైక్ ఉమ్రహ్' అని పలుకుతూ ఇహ్రాం స్థితిలోనికి ప్రవేశించవలెను. ఆ తరువాత వారు ఈ క్రింది లబ్బైక్ పలుకులను, ప్రవక్త సల్లల్లాహు అలైహి యొక్క సున్నతును అనుసరిస్తూ తల్బియా పలకవలెను.

    లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లా షరీక లక లబ్బైక్, ఇన్నల్ హమ్ ద, వ న్నెమత, లకవల్ ముల్క్ – లా షరీక లక్

    నేను హాజరయ్యాను, ఓ అల్లాహ్! నేను హాజరయ్యాను, నేను హాజరయ్యాను, నీకు భాగస్వాములెవరూ లేరు, నేను హాజరయ్యాను, నిశ్చయంగా సకల స్తోత్రములు, ప్రశంసలు మరియు కృతజ్ఞతలు, సకల అనుగ్రహాలు మరియు సకల లోకాలు నీవే – నీకెవరూ భాగస్వాములు లేరు.

అల్లాహ్ యొక్క పవిత్ర కాబాగృహం చేరే వరకు, పై తల్బియా పలుకులు పలుకుతూ ఉండవలెను మరియు అల్లాహ్ యొక్క ధ్యానం చేస్తూ ఉండవలెను. అక్కడికి చేరిన తరువాత తల్బియా పలుకులు పలకటం ఆపి, కాబా గృహం చుట్టూ ఏడు సార్లు తవాఫ్ (ప్రదక్షిణం) చేసి, మఖామె ఇబ్రాహీం వెనుక రెండు రకాతుల నమాజు చేసి, అస్సఫా వైపు సాగిపోవలెను. అస్సఫా మరియు అల్ మర్వాల మధ్య ఏడు సార్లు నడిచి, తల వెంట్రుకలు పూర్తిగా తీసివేయ వలెను లేదా అతి చిన్నవిగా క్షవరం చేయించుకోవలెను. దీనితో ఉమ్రహ్ యాత్ర పూర్తవుతుంది. ఇహ్రాం స్థితిలో ఉండిన నిషేధాలన్నీ ఇపుడు పూర్తిగా తొలిగిపోతాయి మరియు ఆ పనులన్నీ ఇపుడు అంతకు ముందు వలే మరల ధర్మసమ్మతమవుతాయి.

2. రెండో వర్గం ప్రజలు: హజ్ కాలంలో అంటే షవ్వాల్, దుల్ ఖాయిదహ్ మరియు దుల్ హజ్ నెల మొదటి పది దినాలలో మీఖాత్ ప్రాంతానికి చేరుకునే ప్రజలు. అలాంటి వారు ఈ క్రింది వాటిలో ఒక పద్ధతిని ఎంచుకోవచ్చును – కేవలం హజ్ చేయటం, కేవలం ఉమ్రహ్ చేయటం లేదా రెండూ కలిపి చేయటం. తన అంతిమ హజ్ యాత్ర కొరకు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దుల్ ఖాయిదహ్ నెలలో మీఖాత్ ప్రాంతం

వద్దకు చేరినపుడు, ఆయన తన సహచరులకు పై మూండింటిలో ఏదో ఒక దానిని ఎంచుకోమని చెప్పినారు.

హజ్ నెలలో ఖుర్బానీ పశువు వెంట ఉన్న హజ్ యాత్రికుడు ఖిరాన్ (ఖుర్బానీ సమేతం) పద్ధతిలో హజ్ చేసే సంకల్పం చేసుకోవలెను మరియు ఖుర్బానీ పశువు వెంటలేని వ్యక్తి తమత్తు (సుఖసౌఖ్యాలు అనుభవించే) పద్ధతిలో హజ్ చేసే సంకల్పం చేసుకోవలెను:

సున్నతు ప్రకారం, ఒకవేళ హజ్ యాత్రికునితో పాటు ఖుర్బానీ పశువు లేకపోతే, అతను కేవలం ఉమ్రహ్ కొరకు మాత్రమే సంకల్పం చేసుకుని, హజ్ కాలంలో గాక వేరే సమయంలో ఉమ్రహ్ చేసే విధంగా అతను మొత్తం ఉమ్రహ్ ఆచరణలను పూర్తి చేయవలెను. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, ఖుర్బానీ పశువు వెంట ఉన్న సహచరులను 'కేవలం ఉమ్రహ్ కొరకు మాత్రమే ఇహ్రాం ధరించమని' ఆదేశించినారు. మక్కా చేరిన తరువాత ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరల ఇదే విధంగా ఆదేశించినారు. దీనిని అనుసరిస్తూ, సహచరులు తవాఫ్ (కాబా గృహ ప్రదక్షిణ) మరియు సయీ (సఫా మరియు మర్వాల మధ్య నడక) పూర్తి చేసి, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశానుసారం తల వెంట్రుకలు గొరిగించుకున్నారు. అలా వారిపై ఇహ్రాం నిషేధాలన్నీ తొలిగిపోయినాయి. అలాగే ఎవరితో పాటైతే ఖుర్బానీ పశువు వెంట ఉండినదో, వారిని ఖుర్బానీ రోజు వరకు ఇహ్రాం

స్థితిలోనే ఉండమని ఆదేశించినారు. ఖుర్బానీ పశువు తమతో పాటు ఉన్నవారు సున్నతును అనుసరిస్తూ, ఏకకాలంలో ఉమ్రహ్ మరియు హజ్ కొరకు ఇహ్రాం ధరించవలెను. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తనతో పాటు ఖుర్బానీ పశువును వెంట తీసుకు రావటం వలన, పై విధంగా చేసినారు. అంతేగాక తమతో పాటు ఖుర్బానీ పశువు వెంట తీసుకు వచ్చిన ఇతర సహాబాలను కూడా పై విధంగానే చేయమని ఆదేశించినారు. ఇహ్రాం ధరించేటపుడు, ఆయన ఉమ్రహ్ మరియు హజ్ కొరకు లబ్బైక్ అని పలికినారు. దుల్ హజ్ 10వ తేదీన ఖుర్బానీ చేసిన తరువాత ఇహ్రాం స్థితి నుండి బయట పడినారు.

ఎవరైతే తమతో పాటు ఖుర్బానీ పశువు వెంట పెట్టుకుని, కేవలం హజ్ కొరకు మాత్రమే సంకల్పం చేసుకుంటారో, వారు ఖారిన్ ల (ఖిరాన్ పద్ధతిలో హజ్ చేసేవారి) వలే దుల్ హజ్ నెల 10వ తేదీన ఖుర్బానీ చేసే వరకు ఇహ్రాం స్థితిలో కొనసాగవలెను.

పై వివరాల నుండి మనకు తెలిసేదేమిటంటే, ఎవరైతే కేవలం హజ్ కొరకు లేదా హజ్ మరియు ఉమ్రహ్ కొరకు ఇహ్రాం ధరిస్తారో, ఒకవేళ వారితో పాటు ఖుర్బానీ పశువు లేకపోతే, అలాంటి వారు ఉమ్రహ్ తరువాత ఇహ్రాం స్థితిలో కొనసాగటం సరైన పద్ధతి కాదు. సున్నతు ప్రకారం వారు కేవలం ఉమ్రహ్ కొరకు మాత్రమే ఇహ్రాం ధరించి, తవాఫ్ మరియు సయీ పూర్తి చేసి, వెంట్రుకలు చిన్నగా కత్తిరింపజేసుకుని ఇహ్రాం నిబంధనల నుండి బయట పడాలి. తమతో పాటు ఖుర్బానీ

పశువు తీసుకురాని వారిని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలానే చేయమని ఆదేశించి యున్నారు. కానీ, ఎవరైనా చాలా ఆలస్యంగా చేరుకోవటం వలన హజ్ సమయం కోల్పోయేటట్లుంటే, అలాంటి వారి కొరకు ఒకే ఇహ్రాంలో హజ్ మరియు ఉమ్రహ్ చేసే అనుమతి ఉంది (ఖుర్బానీ పశువు వెంట లేకపోయినా సరే).

## షరతులతో కూడిన ఇహ్రాం:

ఒకవేళ ఎవరైనా ఆరోగ్యం కారణంగా లేక శత్రువు భయం వలన ఉమ్రహ్/హజ్ పూర్తి చేయలేక పోతామేమోననే భయంతో ఉంటే, వారు ఇహ్రాం ధరించేటపుడు చేసే సంకల్పానికి ఈ షరతును జత చేయవలెను – "ఒకవేళ ఏదైనా ఆటంకం కారణంగా (దారిలో) నిరోధించబడితే, నీవు నన్ను ఆపిన ఆ స్థానమే నా ఈ స్థితి నుండి స్వేచ్ఛను పొందే స్థానమవుతుంది". దీనిని జుబైర్ కుమార్తె అయిన దుబహ్ ఉల్లేఖించారు. ఆవిడ ఇలా అన్నారు, "ఓ రసూలుల్లాహ్! నేను హజ్ చేయాలని సంకల్పం చేసుకున్నాను. కానీ, నా ఆరోగ్యం సరిగా లేదు". అపుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెను 'ఎక్కడైతే ఆటంకం ఎదురవుతుందో, ఆ స్థానంలో ఇహ్రాం నుండి స్వేచ్ఛను పొందే' షరతును జత చేసి హజ్ సంకల్పం చేయమని సూచించారు. దీని నుండి మనకు తెలిసేదేమిటంటే, ఒకవేళ ఎవరైనా ఇహ్రాం స్థితిలోని వ్యక్తికి అనారోగ్యం లేదా శత్రువు వలన ఆటంకం ఎదురైతే, పైన పేర్కొన్న విధంగా అక్కడే ఇహ్రాం స్థితిలో నుండి స్వేచ్ఛ పొందటం కొరకు అతనికి అనుమతి ఉంది

మరియు దీనికి బదులుగా అతను ఎలాంటి ప్రాయశ్చిత పరిహారం చెల్లించవలసిన అవసరం లేదు.

**చిన్నపిల్లల హజ్:**

సహీహ్ ముస్లింలో పేర్కొనబడిన అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన ఆధారంగా చిన్నపిల్లల హజ్ పూర్తిగా సరైనదే. తన బిడ్డను పైకెత్తి, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు చూపుతూ, ఆవిడ ఇలా అడిగినది "ఓ రసూలుల్లాహ్! ఇతని (ఈ బిడ్డ) కొరకు హజ్ ఉన్నదా?". దానికి ఆయన "ఉంది. మరియు నీకు ప్రతిఫలం లభిస్తుంది." అని జవాబిచ్చినారు.

తను ఏడు సంవత్సరాల వయస్సులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు హజ్ చేసానని తెలిపిన సయీబ్ బిన్ యజీద్ రదియల్లాహు అన్హు ఉల్లేఖన సహీహ్ బుఖారీలో ఉంది. అయితే అలాంటి హజ్ నఫిల్ హజ్ గా మాత్రమే పరిగణింపబడును. విధిగా చేయవలసి ఉన్న తప్పని సరి హజ్ బాధ్యతను అది పూర్తి చేయదు. బానిస వ్యక్తి మరియు బానిస స్త్రీకి కూడా ఇదే నియమం వర్తిస్తుంది, వారి హజ్ నఫిల్ హజ్ గా పరిగణింపబడునే గాని విధిగా చేయవలసి ఉన్న తప్పనిసరి హజ్ గా కాదు. అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన క్రింది హదీథులో ఈ విషయం స్పష్టంగా తెలుపబడింది:
ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

“ఒకవేళ ఏ బిడ్డ అయినా హజ్ చేస్తే, అతను యువకుడైన తరువాత మరల హజ్ చేయవలసి ఉంది. మరియు ఒకవేళ ఎవరైనా బానిస హజ్ చేస్తే, అతను స్వేచ్ఛను పొందిన తరువాత మరల హజ్ చేయవలసి ఉంది”.

ఒకవేళ ఆ బాలుడికి సరైన అవగాహన ఇంకా రాకపోతే, అతని సంరక్షకుడు ఆ బాలుని కొరకు ఇహ్రాం సంకల్పాన్ని వ్యక్తం చేయాలి. అతను ఆ బాలుడి దుస్తులు మార్చి, ఇహ్రాం దుస్తులు తొడిగించి, అతని తరుఫున లబ్బైక్ ఉచ్ఛరించాలి. దుస్తులను తొలగించి, ఇహ్రాం దుస్తులు ధరింపజేసిన తరువాత ఆ బాలుడు ఇహ్రాం స్థితిలో ఉన్నట్లుగా పరిగణించబడతాడు. ఇహ్రాం స్థితిలో పెద్దలకు ఏ నిషేధాజ్ఞలైతే వర్తిస్తాయో, అవే నిషేధాజ్ఞలు ఆ బాలుడి కొరకు కూడా వర్తింపబడును. అలాగే ఒకవేళ ఆ బాలికకు సరైన అవగాహన ఇంకా రాకపోతే, ఆమె సంరక్షకురాలు ఆ బాలిక తరుఫున ఇహ్రాం సంకల్పాన్ని వ్యక్తం చేయాలి మరియు లబ్బైక్ పలకాలి. అలా ఆ బాలిక ఇహ్రాం స్థితిలో ఉన్నట్లుగా పరిగణింపబడుతుంది. ఇహ్రాం స్థితిలో పెద్దలకు ఏ నిషేధాజ్ఞలైతే వర్తిస్తాయో, అవే నిషేధాజ్ఞలు ఆ బాలిక కొరకు కూడా వర్తిస్తాయి. తవాఫ్ చేసేటపుడు, వారి శరీరం మరియు దుస్తులు పరిశుభ్రంగా ఉండాలి. తవాఫ్ కూడా నమాజు వంటిదే. కాబట్టి పవిత్ర స్థితిలోనే తవాఫ్ చేయవలెను.

ఒకవేళ బాలుడు లేదా బాలిక విషయాలను అర్థం చేసుకునే స్థితిలో ఉంటే, తమ సంరక్షకుల అనుమతితో వారు స్నానం చేసి, దేహానికి అత్తరు పూసుకుని, ఇహ్రాం ధరించవచ్చు. పెద్దలు ఇహ్రాం ధరించే విధంగానే పిల్లలు కూడా ఇహ్రాం ధరించవలెను. వారి సంరక్షకులు వారి ఆచరణలను పర్యవేక్షిస్తూ, వారి అవసరాలను తీర్చవలెను. ఆ సంరక్షకులు – తల్లి కావచ్చు, తండ్రి కావచ్చు లేదా వేరే ఇతరులెవరైనా కావచ్చు. పిల్లలు స్వతహాగా చేయలేని ఆచరణల విషయంలో, ఆ ఆచరణలను వారి సంరక్షకులు పూర్తి చేయవలెను. ఉదాహరణకు – జమరహ్ లో రాళ్ళు విసరటం (రమ్మీ చేయటం). కానీ అరఫాత్ మైదానంలో నిలుచోవటం, ముజ్దలిఫా మరియు మీనాలలో రాత్రి గడపటం, తవాఫ్ మరియు సయీ చేయటం మొదలైన ఇతర ఆచరణలన్నింటినీ వారు పూర్తి చేయవలెను. అవసరమైతే పిల్లల సంరక్షకులు పిల్లలను తమ చేతులలో ఎత్తుకుని, భుజాల మీద కూర్చో పెట్టుకుని ఆ ఆచరణలు పూర్తిచేయటంలో తోడ్పడవచ్చు. అయితే పిల్లలను ఎత్తుకున్న వ్యక్తి, ఏకకాలంలో తన కోసం మరియు ఆ పిల్లవాని కోసం తవాఫ్ చేయలేడు. అంటే అతను తన కోసం తవాఫ్ పూర్తి చేసుకుని, ఆ తరువాత పిల్లవాని కోసం మరో తవాఫ్ చేయవలసి ఉంది. అలాగే సయీ కూడా. పిల్లల తరుఫున అతను తవాఫ్ మరియు సయీ కొరకు సంకల్పం చేసుకోవచ్చు. క్రింద తెలిపిన హదీథును అనుసరిస్తూ, ఇలా తగిన జాగ్రతలు తీసుకోవటం మంచిది.

“ఖచ్చితమైన దానిని అనుసరించండి మరియు సందేహాస్పదమైన దానిని వదిలి పెట్టండి”

అయితే, ప్రామాణిక అభిప్రాయం ప్రకారం, ఒకవేళ బిడ్డను ఎత్తుకున్న వ్యక్తి, తనకోసం మరియు తన బిడ్డ కోసం ఒకేసారి తవాఫ్ మరియు సయీ సంకల్పం చేసుకుంటే, అది కూడా సరిపోతుంది. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన బిడ్డ కొరకు వేరే తవాఫ్ చేయమని తన బిడ్డ హజ్ గురించి అడిగిన ఆ మహిళను ఆదేశించలేదు. ఒకవేళ అలా వేరుగా తవాఫ్, సయీ చేయటం తప్పని సరై ఉంటే, ఆయన తప్పకుండా దాని గురించి ఆమెను ఆదేశించి ఉండేవారు. విషయాలను అర్థం చేసుకోగలిగే బాలికలకు మరియు బాలురకు పవిత్రత, పరిశుభ్రత, అపరిశుభ్రత గురించి తవాఫ్ ప్రారంభించక ముందే బోధించవలెను. అలాగే, ఇహ్రాంలో ఉన్న పెద్దలకు కూడా. పిల్లల తరుఫున, వారి సంరక్షకులుగా ఆచరణలు చేస్తున్న పెద్దవారు ఇహ్రాం ధరించవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఇది నఫిల్ ఆచరణ క్రిందికి వస్తుంది. ఒకవేళ ఆ సంరక్షకులు ఇహ్రాం ధరిస్తే, వారికి ప్రతిఫలం లభిస్తుంది. ఒకవేళ అలా ధరించక పోతే, దానిలో ఎలాంటి పాపమూ లేదు.

## ఇహ్రాం స్థితిలో అనుమతింపబడిన మరియు నిషేధింపబడిన విషయాలు:

ఇహ్రాం సంకల్పం చేసుకున్న తరువాత స్త్రీపురుషులు వెంట్రుకలు లేదా గోళ్ళు గొరగటం లేదా కత్తిరించటం, అత్తరు పూసుకోవటం మొదలైనవి చేయరాదు. ఇహ్రాం స్థితిలో ప్రవేశించిన తరువాత అలాంటి పనులకు అనుమతి లేదు. ముఖ్యంగా మగవారికి షర్టు, ప్యాంటు, కుర్తా, పైజామా, మేజోళ్ళు మొదలైన కుట్టబడిన దుస్తులు ధరించే అనుమతి లేదు. ఒకవేళ తన నడుము చుట్టూ కట్టుకోవటానికి ఏదైనా దుప్పటి లాంటి వస్త్రం లభించనపుడు, అతను సుర్వాల్ (పైజామా వంటిది) వంటిది తొడుక్కోవచ్చు. అలాగే, రబ్బరు చెప్పులు లేదా మామూలు చెప్పులు లేకపోతే, అతడు కత్తిరించని చర్మపు మేజోళ్ళు (కుఫ్) తొడుక్కోవచ్చు. బుఖారీ మరియు ముస్లింలలో నమోదు చేయబడిన అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా యొక్క ఈ ఉల్లేఖనలో, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

"ఎవరి వద్దనైతే స్లిప్పర్లు లేదా చెప్పులు లేవో, అలాంటివారు చర్మపు మోజోళ్ళు (కుఫ్) తొడుక్కోవచ్చు. మరియు ఎవరి వద్దనైతే ఇజార్ (నడుము చుట్టూ కట్టుకునే దుప్పటి వంటి వస్త్రం) లేదో, అలాంటి వారు పైజామా (సుర్వాల్) తొడుక్కోవచ్చు."

అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖన ప్రకారం, ఒకవేళ అవసరమైతే 'కత్తిరించబడిన చర్మపు మేజోళ్ళ' తొడుక్కోవచ్చు అనే విషయంలో 'కత్తిరించబడటమనేది' రద్దు చేయబడినది. ప్రవక్త

సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాలో అడగబడిన 'ఇహ్రాంలోని వ్యక్తి ఎలాంటి దుస్తులు ధరించవచ్చనే' ప్రశ్నకు బదులుగా ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనలో తెలిపినట్లుగా జవాబిచ్చినారు. అయితే ఒకవేళ చెప్పులు లేకపోతే, చర్మపు చెప్పులు (కుఫ్ లు) తొడుక్కోవచ్చని ఆయన అరఫాత్ ఉపన్యాసంలో పలికినారు. అంతేగాని ఆ చర్మపు చెప్పులు కత్తిరించబడాలని అనలేదు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాలో పై పలుకులు పలికినపుడు చుట్టు ఉన్నవారిలో కొందరు మదీనా పై పలుకులు పలికినపుడు ఆయన సమీపంలో లేరు. ఆవశ్యక విషయాన్ని ఆలస్యం చేయడం తగదనే విషయం మనకు తెలుసు. కాబట్టి, చర్మపు చెప్పులు కత్తిరించబడాలనే విషయం రద్దు చేయబడినదనే విషయం ఋజువైనది. ఒకవేళ అది అవసరమైన విషయమై ఉంటే, ఆయన దానినితప్పకుండా పలికి ఉండేవారు.

చెప్పుల వలే కాలి చీలమండలం కంటే క్రింద ఉండే చర్మపు మేజోళ్ళు (కుఫ్ లు) తొడుక్కోవటానికి ఇహ్రాంలోని వారికి అనుమతి ఉంది. నడుము చుట్టూ కట్టుకునే ఇజార్ వస్త్రానికి ముడి వేసి, దారంతో (త్రాడుతో) కట్టడానికి అనుమతి ఉంది. ఎందుకంటే అలా చేయకూడదని ఎక్కడా చెప్పబడలేదు. అలాగే ఇహ్రాంలోని వ్యక్తి స్నానం చేయవచ్చు, తన తల కడుక్కోవచ్చు, మృదువుగా తల గోక్కోవచ్చు. అలా గోక్కోవటం వలన ఒకవేళ వెంట్రుకలేవైనా రాలితే, అందులో ఎలాంటి దోషం లేదు.

ఇహ్రాంలోని స్త్రీల కొరకు ముసుగు వంటి వేరే వస్త్రంతో ముఖం కప్పుకోవటం, చేతులకు చేతిమేజోళ్ళు తొడుక్కోవటం నిషేధించబడింది. దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

"ఇహ్రాంలోని స్త్రీ ముఖంపై ముసుగు వేసుకోకూడదు, చేతులకు చేతి మేజోళ్ళు (ఖుఫ్ఫాజ్) తొడుక్కోకూడదు" బుఖారీ

ఖుఫ్ఫాజ్ అంటే ఉన్ని లేదా కాటన్ నేయబడిన చేతి మేజోళ్ళు. అయితే స్త్రీల కొరకు ఇహ్రాం స్థితిలో కూడా షర్టులు, ప్యాంట్లు,షల్వార్ ఖమీజులు మేజోళ్ళు మొదలైన ఇతర కుట్టబడిన దుస్తులు తొడుక్కునే అనుమతి ఉంది. అలాగే, పరాయి మగవాళ్ళు ఎదురైనపుడు, ఆమె తన ముఖాన్ని చేతిరుమాలుతో కప్పుకోవచ్చు. తలపై కప్పుకునే తలగుడ్డలో (head scarf) ముఖం దాచుకుంటే తప్పులేదు. ఆయెషా రదియల్లాహు అన్హా ఇలా పలికినారు: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు చేసిన హజ్ లో, పురుష యాత్రికుల సమూహం తమను దాటుతూ, ఎదురు బదురు అయినపుడు, స్త్రీలు తమ తలగుడ్డను క్రిందికి జార్చి, ముఖం కనబడకుండా జాగ్రత్త పడేవారు. ఆ పురుషులు తమను దాటిన తరువాత, వారు తమ ముఖాలపై జార్చుకున్న తలగుడ్డను తొలగించుకునేవారు. (అబూ దావూద్, ఇబ్నె మాజా, అద్దర్ ఖుత్నీ)

అలాగే, పరాయి మగవారు తమ పరిసరాలలో ఉన్నపుడు, దేనితోనైనా తన చేతులను కప్పుకోవటానికి వారికి అనుమతి ఉంది. అలాంటి

పరిస్థితులలో తమ ముఖాలను మరియు చేతులను కప్పుకోవటం వారి బాధ్యత. అల్లాహ్ యొక్క ఆదేశానుసారం, ఈ శరీర భాగాలు కప్పుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

"మరియు తమ అలంకారాలను తమ భర్తలకు తప్ప ఇతరులకు చూపరాదు" 24:31

చేతులు మరియు ముఖం – రెండూను మగువల ఆకర్షణలను ప్రతిబింబిస్తాయి. మరియు ముఖాలు చేతుల కంటే మరింత ఆకర్షణీయమైనవి. ఈ విషయం ఖుర్ఆన్ వచనంలో స్పష్టంగా తెలుపబడింది:

"మీరు ఏదైనా అడగవలసి వచ్చినపుడు తెర వెనుక నుంచి అడగండి. మీ అంతర్యాల, వారి హృదయాల పరిశుద్ధత కోసం ఇదే మంచిది." ఖుర్ఆన్ వచన భావానువాదం 33:53

అనేక మంది స్త్రీలు (హజ్ /ఉమ్రహ్ లలో) తలపై కప్పుకునే తలగుడ్డలకు జత చేసే అదనపు వస్త్రానికి ఎలాంటి ఆధారమూ లేదు. తలగుడ్డ ముఖానికి తగలకుండా వారలా చేస్తుంటారు. ఒకవేళ అదే అలా చేయటం అవసరమైతే, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తన సమాజానికి ఆ విధంగా చేయమని బోధించి ఉండేవారు. అంతేగాని ఆయన ఈ విషయం గురించి మాట్లాడకుండా నిశ్శబ్దంగా ఉండేవారు కాదు. పురుషులు మరియు స్త్రీలు తమ ఇహ్రాం దుస్తులను

కడుక్కోవచ్చు మరియు ఇహ్రాం జతను మార్చుకోవచ్చు – ఇది అనుమతించబడింది. కాషాయరంగు అద్దకం వేయబడిన దుస్తులు మాత్రం వాడకూడదు. ఎందుకంటే అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖన ఆధారంగా, దీనిని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిషేధించారనే విషయం స్పష్టమవుతున్నది.

అల్లాహ్ ఆదేశాలను అనుసరించి ఇహ్రాం స్థితిలో ఉన్నవారు అనవరమైన వ్యర్థ సంభాషణలలో పాల్గొనరాదు, పాపాకార్యాలు చేయరాదు, పోరాడరాదు / ఘర్షణ పడరాదు.

"హజ్జ్ నెలలు అందరికీ తెలిసినవే. వాటిలో ఎవరైతే హజ్జ్ చేయుటకు తలపెడతారో, వారు హజ్జ్ సమయంలో (భార్యలతో) లైంగిక కలాపాలకు, పాపపు పనులకు, జగడాలకు దూరంగా ఉండండి. మీరు ఏ సత్కార్యం చేసినా, అది అల్లాహ్ కు తెలియును. ప్రయాణసామాగ్రిని వెంట తీసుకుని వెళ్ళండి. నిశ్చయంగా, అత్యుత్తమ సామగ్రి దైవభీతి మాత్రమే. మరియు ఓ వివేకవంతులారా! కేవలం నాకు మాత్రమే భయపడండి". 2:197

ఇదే విషయం ఒక హదీథులో కూడా చెప్పబడింది: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు, "ఎవరైతే హజ్ చేస్తారో, మరియు అశ్లీల, అసభ్య కార్యాలకు (రఫత్) మరియు దౌర్జన్యానికి (ఫుసుఖ్) పాల్పడరో, అలాంటి వారు అప్పుడే పుట్టిన శిశువు వలే (పాపరహితంగా) మరలి వస్తారు"

రఫత్ అంటే లైంగిక కార్యకలాపాలు, శృంగార వ్యవహారాలు మరియు వ్యర్థ సంభాషణలు, పనికిమాలిన వ్యర్థాచరణలు. ఫుసుఖ్ అంటే మామూలుగా పాపకార్యాలని అర్థం. జిదాల్ అంటే అర్థం పర్థం లేని విషయంపై పోట్లాడటం. అయితే, సముచితమైన పద్ధతిలో సత్యాన్ని సమర్ధించే మరియు అసత్యాన్ని ఖండించే సంభాషణలు అనుమతించబడటమే గాక ప్రోత్సహించబడినాయి కూడా. దీని గురించి అల్లాహ్ యొక్క ఆదేశం ఇలా ఉన్నది:

"నీ ప్రభువు మార్గం వైపు జనులను వివేకంతోనూ, చక్కని ఉపదేశంతోనూ పిలువు. అత్యుత్తమ రీతిలో వారితో సంభాషణ జరుపు." 16:125

టోపీ, తలపాగా వంటి తలకు అంటుకుని ఉండే వేటితోనైనా తమ తలను లేదా ముఖాన్ని కప్పుకోవటం పురుషుల కొరకు నిషేధించబడింది. ఒంటె తన్నటం వలన ఒక సహచరుడు అరఫాత్ దినమున చనిపోయినాడు. అతని అంత్యక్రియలలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

"అతని శరీరాన్ని నీటితో మరియు సిద్ర్ తో కడగండి. అతని రెండు ఇహ్రాం వస్త్రాలను కఫన్ వాడి వాటిలో అతనిని చుట్టండి. మరియు అతని తలను మరియు ముఖాన్ని కప్పవద్దు – ఎందుకంటే అంతిమదినాన అతను లబ్బైక్ పలుకుతూ లేస్తాడు." ముత్తఫిఖ్ అలైహ్.

అయితే, ఎవరైనా కారు పైకప్పు క్రింద గానీ, గొడుగు క్రింద గానీ తలదాచుకుంటే ఏమీ దోషం లేదు. అలాగే గుడారం లోపల లేదా చెట్టు క్రింద తలదాచుకున్నా ఏ తప్పూ లేదు. జమరతుల్ అఖ్బా పై రాళ్ళు విసురుతున్నపుడు, ఆయన సహచరులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పై ఒక వస్త్రంతో నీడ కల్పించారు. మరో హదీథులో అరఫహ్ దినమున నమిరహ్ వద్ద ఆయన కొరకు ఒక గుడారం వేయబడిందని, ఆయన దానిలో సూర్యాస్తమయం వరకు ఉన్నారని పేర్కొనబడింది.

ఇహ్రాం స్థితిలో ఉన్న స్త్రీ, పురుషుల కొరకు – భూమిపై జంతువులను వేటాడటం, వేటలో పాల్గొనటం లేదా సహాయపడటం, వేటాడుతూ జంతువుల వెనుకబడటం, పెళ్ళాడటం, దాంపత్య సుఖం అనుభవించటం, పెళ్ళి రాయబారం పంపడం, ఎవరైనా స్త్రీని కామంతో స్పర్శించడం మొదలైనవన్నీ నిషేధించబడినాయి. ఉథ్మాన్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన క్రింది హదీథులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విషయాన్ని ఇలా స్పష్టం చేసారు,

“ఒక ముహ్రిం స్వయంగా తను పెళ్ళాడరాదు, తన తరఫు పెళ్ళి జరిపించుకోవటమూ చేయరాదు, పెళ్ళి రాయబారమూ పంపరాదు.” ముస్లిం హదీథు గ్రంథం.

అజ్ఞానం వలన (నిషేధాజ్ఞలు తెలియకపోవటం వలన) ఎవరైనా ఇహ్రాం స్థితిలో తలపై ఏదైనా వస్త్రం వేసుకోవటం, టోపీ పెట్టుకోవటం, తలపాగా

పెట్టుకోవటం, అత్తరు పూసుకోవటం వంటివి చేస్తే, అతనిపై ఎలాంటి ప్రాయశ్చిత పరిహారమూ (దమ్) లేదు. తనకు వాటి గురించిన నిషేధాజ్ఞలు తెలియగానే లేదా ఎవరైనా అతని తప్పును అతనికి తెలియజేయగానే, అతను తన తప్పును సరిదిద్దుకోవలెను – అంటే తలపై నుండి టోపి వంటి వాటిని, తలగుడ్డను తొలగించవలెను. అలాగే ప్రామాణిక ఉల్లేఖనల ఆధారంగా, మతిమరుపు వలన లేదా అనాలోచితంగా లేదా తెలియక ఎవరైనా వెంట్రుకలు లేదా గోళ్ళు గొరిగించుకున్నా, కత్తిరించుకున్నా అతనిపై ఎలాంటి ప్రాయశ్చిత పరిహారమూ లేదు.

ఏ ముస్లిమైనా – ఇహ్రాం స్థితిలో ఉన్నా లేదా ఇహ్రాం స్థితిలో లేకపోయినా; స్త్రీ అయినా, పురుషుడైనా; జంతువులను వేటాడటం, సంజ్ఞలతో లేదా ఆయుధాలతో లేదా జంతువులను ఒక చోటకు తోలటం మొదలైన వేట పనులలో సహాయపడటం వంటివి కాబాగృహ పవిత్ర హద్దులలో నిషేధించబడింది. ఆ ప్రాంతంలోని చెట్లను నరకటం, పచ్చికను కోయడం మొదలైనవి కూడా నిషేధించబడినాయి. అంతేగాక ఆ పరిధి లోపల పడి ఉన్న ఇతరుల ఏ వస్తువునైనా ఎత్తుకోవటం కూడా నిషేధించబడింది - దాని గురించి చాటింపు వేయటానికైతే తప్ప. దీని గురించి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు,

“అల్లాహ్ ఆదేశాలనుసారం అంతిమ దినం వరకు ఈ నగరం (మక్కా) పావనమైనది. దీని చెట్లు నరకరాదు. దీని జంతువులను వేటాడరాదు.

దీని పచ్చికను కోయరాదు. క్రింద పడి ఉన్న వస్తువులను ఎత్తుకోరాదు – వాటి గురించి అందరికీ తెలిసేలా ప్రకటించే ఉద్దేశ్యంతో ఎత్తుకునే వారు తప్ప.”

ఇక్కడ పచ్చిక అంటే తాజా మొక్కలు, వృక్షసంపద. మీనా మరియు ముజ్దలిఫాలు కూడా కాబా గృహ పవిత్ర సరిహద్దుల లోపలే వస్తాయి. అయితే అరఫాత్ ఈ పవిత్ర కాబా గృహ సరిహద్దులోనికి రాదు.